క్లుప్తంగా

నేడు మెగా వైద్య శిబిరం

పాలకొండ : స్థానిక ఏరియా ఆస్పత్రిలో గురువారం మెగా వైద్యశిబిరం నిర్వహిస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ కడియం చిరంజీవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని, రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

298 మందికి వైద్య పరీక్షలు

వీరఘట్టం: మండలంలోని హుస్సేనుపురం, చలివేంద్రి గ్రామాల్లో స్వస్థ స్వశక్తి పరివార్ అభియాన్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిటివాడ, వీరఘట్టం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎ. మానస, ఎం.సాయికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది 298 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది ఓ.శాంతికుమారి, సుభారతామని, లలితకుమారి, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వీరఘట్టం: ప్రభుత్వం ఆటో, క్యాబ్ డ్రైవర్లకు త్వరలో అందించనున్న ఆర్థికసాయం కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ బి. వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ నెల 22లోపు ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి, 24న తుది జాబితా వెల్లడిస్తామన్నారు. అక్టోబర్ 1న ఆర్థిక సాయం అందిస్తారని తెలిపారు.

పలు గ్రామాల్లో కలగొప్పులు



పెద్దూరులో మొక్కులు చెల్లిస్తున్న రైతులు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు, బురద వెంకటాపురం, చినగొడవ, ఉల్లిభద్ర తదితర గ్రామాలలో బుధవారం కలగొప్పులను నిర్వహించారు. ఖరీఫ్ వరి పంటల్లో చీడ పీడల నివారణకు, పంటలు బాగా పండాలని ప్రతి ఏటా కలగొప్పులను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ మేరకు పూజలు నిర్వహించి అమ్మవారికి మేకలను, కోళ్లను బలి ఇచ్చి మొక్కలను చెల్లించుకుంటారు. బలి ఇచ్చిన ద్రవ్యాలను పంట పొలాల్లో వేసి తమ మొక్కులను చెల్లించుకుంటారు.

అవగాహనతో ప్రమాదాలు అధిగమిద్దాం



బ్యాంక్ సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాలను అవగాహనతో అధిగమించవచ్చని పాలకొండ ఫైర్ ఎస్సై జామి సర్వేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక స్టేట్‌బ్యాంక్‌లో ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ జేఏసీ నాయకులు

పాలకొండ: సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బందికి రావాల్సిన రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు చెల్లించాలని, ఆరు సంవత్సరాలుగా ప్రమోషన్ లేకుండా పనిచేస్తున్న వారికి నోషనల్ ఇంక్రిమెంట్ అందించాలని కోరారు. అలాగే సర్వేల పనిభారం తప్పించాలని, నిర్దిష్టమైన సర్వీస్ రూల్స్ రూపొందించాలన్నారు.

రక్తదాన శిబిరం




రక్తదానం చేస్తున్న పార్టీ నాయకుడు

పాలకొండ రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు బుధవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. వివిధ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ గల విద్యార్థులకు పుస్తకాలు, అట్టలు, పెన్నులు అందజేశారు. అలాగే స్థానిక ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ముంజేటి ఉమా, కుమార్ రాజా, మహాలక్ష్మి, పెద్దబాబు, తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు

ముమ్మర ఏర్పాట్లు

- ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు ఉత్సవాలు
- రోజుకో అలంకారంలో దర్శనమివ్వనున్న అమ్మవారు
- ఈ ఏడాది 11 రోజుల పాటు ఉత్సవాలు





ముస్తాబైన కోటదుర్గమ్మ ఆలయం (ఇన్‌సెట్లో) వీరఘట్టం కోటదుర్గతల్లి

వీరఘట్టం:

ఏటా తొమ్మిది రోజులు పాటు ఘనంగా జరిగే దేవీ నవరాత్రి ఉత్సవాలు ఈ ఏడాది 11 రోజుల పాటు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు వీరఘట్టం కోట దుర్గమ్మ ఉత్సవాలు (శరన్నవరాత్రులు) నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. గంగా, భవానీ, గాయత్రీ, లలితా, కాత్యాయని, కాళీ, మహాచండీ, లక్ష్మీ, సరస్వతి, అన్నపూర్ణ, రాజరాజేశ్వరి రూపాల్లో అమ్మవారిని కొలవనున్నారు. అక్టోబర్ రెండో తేదీన విజయ దుర్గగా ఆరాధించి విశేష పూజలు చేపట్టనున్నట్లు శర్మయాజీ తెలిపారు.

ఆలయ చరిత్ర..

వీరఘట్టం కోటదుర్గ ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని పెద్దలు చెబుతున్నారు. అచ్చపువలస రాజుల పరిపాలనలో కోటలో వెలిసిన దుర్గాదేవి ఈ రాజ్యాన్ని ఎంతో సుభిక్షంగా ఉంచేందుకు రాత్రులు పహారా కాసేదని ఉవాచ. గజ్జెల సవ్వడితో ఊరి పొలిమేర్లల్లో తిరుగుతూ గ్రామంలోకి దుష్ట శక్తులు రాకుండా కాపు కాచేదని.. ఆ సమయంలో ఎవరైనా పనిమీద బయటకు వస్తే అమ్మవారు వృద్ధురాలిగా కనిపించి యోగక్షేమాలు అడిగి తెలుసుకునేవారు. నేటికి కూడా దుర్గగుడి సమీపంలో అర్ధరాత్రి సమయంలో గజ్జల శబ్దం వినిపిస్తూ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఏ పనిమీద బయటకు వెళ్లినా అమ్మవారిని దర్శించుకుని వెళ్లడం పరిపాటిగా మారింది.

ఆలయానికి నూతన శోభ..

ఆలయాన్ని రెండేళ్ల కిందట పునర్నిర్మించారు. ఏకశిలాయుత మకరతోరణ సింహవాహన పీఠస్థిత దుర్గా భవానీ విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు. దుర్గాదేవి ఏకశిలా విగ్రహంతో భక్తులకు దర్శనమిస్తుండడంతో గతేడాది నుంచి భక్తుల రద్దీ పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కుంకుమ పూజలు..

శరన్నవరాత్రులు సెప్టెంబర్ 22 నుంచి ప్రారంభం కానున్నందున తొలి రోజు నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు ప్రతిరోజూ మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. అలాగే ఈ నెల 19న 108 మంది భవానీ భక్తులు మాలధారణ చేయనున్నారు. వీరిచే ప్రతిరోజూ అమ్మవారికి హోమం చేస్తారు. అక్టోబర్ 2న విజయదశమి రోజున భక్తులందరూ అమ్మవారిని దర్శించుకున్న తర్వాత సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి తిరువీధి నిర్వహిస్తారు.

ఈ ఏడాది ప్రత్యేకం..



శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ ఏడాది 11 రోజులు రావడం విశేషం. తిథుల్లో హెచ్చుతగ్గులు రావడమే ఇందుకు కారణం. దసరా మహోత్సవాల్లో అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో శుభం. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలి. భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. – ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ, యజ్ఞకర్త

ఎమ్మెల్సీని అగౌరపరచడం తగదు



భామిని: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: సౌమ్యుడు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసే ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను అగౌరపరచడం తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు తోట సింహాచలం, బోదెపు శ్రీనివాసరావు, మజ్జి మోహన్‌బాబు, తదితరులు మాట్లాడుతూ.. పాలకొండలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని ఎమ్మెల్సీకి ఆహ్వానం పంపి, కూటమి నాయకులు అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని చూస్తే ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, రైతు సంఘ అధ్యక్షుడు కాగితాపల్లి కృష్ణారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హేయమైన చర్య..

వీరఘట్టం: పాలకొండలో బుధవారం మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను రానీయకుండా అడ్డుకోవడం హేయమైన చర్య అని పాలకొండ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు పొట్నూరు లక్ష్మణరావు ధ్వజమెత్తారు. బుధవారం ఆయన తెట్టంగి గ్రామంలో మీడియాతో మాట్లాడుత.. ఒక ఎమ్మెల్సీకి రాజ్యాంగపరంగా ఉన్న హక్కులను కూటమి నాయకులు కాలరాస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రశ్నలు సంధిస్తారనే భయంతోనే ఎమ్మెల్సీని అడ్డుకున్నారన్నారు.

పరామర్శ



ఆదినారాయణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి తదితరులు

గరుగుబిల్లి: ఇటీవల గిజబ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యుడు మరడాన ఆదినారాయణ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మరణ వార్త తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు బుధవారం గిజబ గ్రామంలో ఆదినారాయణ కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే కుటుంబ సభ్యులు మంగమ్మ, పిల్లలు దివ్యశ్రీ, జాహ్నవిలకు ధైర్యం చెప్పారు. వారి వెంట జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు, మరడాన సీతంనాయుడు, శెట్టి శ్రీనివాసరావు, ఆవాల కన్నయ్య, వాసుదేవరావు, అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

దసరా ఏర్పాట్ల పరిశీలన



కోటదుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లపై ఆరా తీస్తున్న సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాల ఏర్పాట్లను సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై డీఎస్పీ రాంబాబుకు పలు సూచనలు చేశారు. ఈ నెల 22 నుంచి దసరా ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి ఉన్నారు.

సమస్యలను పరిష్కరించండి



చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

పాలకొండ రూరల్: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్ల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సీఐటీయూ నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుతో పాటు జీఓ 21 రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కాద రాము, సింహాచలం, పాపారావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి ఆహ్వానం

సాలూరు: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, కన్వీనర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఈ నెల 28 ఆఖరు తేదీ అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలకు దరఖాస్తు చేసుకున్నవారికి ఈ నెల 29న ప్రభుత్వ కళాశాలల్లో, ప్రైవేట్ కళాశాలలకు దరఖాస్తు చేసుకున్నవారికి ఈ నెల 30న ఆ ప్రైవేట్ కళాశాలల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9052508903, 8886789002 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చలో ప్రభుత్వ మెడికల్ కళాశాల కార్యక్రమానికి తరలిరండి

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న చలో ప్రభుత్వ మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలోని పది మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేసేందుకు పీపీపీ విధానానికి తెరలేపిందని, దీన్ని వ్యతిరేకిస్తూ.. మెడికల్ కళాశాలలను రాష్ట్రంలో ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు.

విగ్రహాల ఆవిష్కరణ

పాలకొండ/పాలకొండ రూరల్: మండలంలోని పనుకువలస ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జ్ఞాన సరస్వతీదేవి, మహాత్మా గాంధీ, సర్వేపల్లి రాధాకృష్ణల విగ్రహాలను డీఎస్పీ ఎం. రాంబాబు బుధవారం ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన ఆధ్యాత్మికవేత్త సామంతుల దామోదరరావు ఆధ్వర్యంలో ఈ విగ్రహాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మకు పూజలు



వీరఘట్టం: విశ్వకర్మకు పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు



పాలకొండ రూరల్: పట్టణంలో కొలువుతీరిన మద్విరాట్ విశ్వకర్మ



కురుపాం: మొండెంఖల్ గ్రామంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా పూజల్లో పాల్గొన్న విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు



గుమ్మలక్ష్మీపురం: విశ్వకర్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



గరుగుబిల్లి: శాంతి హోమం పూజలలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు

పాలకొండ రూరల్: శ్రీమద్విరాట్ విశ్వకర్మ జయంత్యుత్సవాలను స్థానిక సనారి విశ్వేశ్వర విశ్వబ్రాహ్మణ సంఘం నేతృత్వంలో బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దేవతల శిల్పి విరాట్ విశ్వకర్మ విగ్రహాన్ని సనారివారి జ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను సనారి మఠం అభివృద్ధి కమిటీ సభ్యులు, స్వర్ణకార సంఘ ప్రతినిధులు పర్యవేక్షించారు.

భామిని: మండలంలోని బత్తిలిలో విశ్వకర్మ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం మంటపంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.

వీరఘట్టం: మండల కేంద్రంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో బూరాడ లక్ష్మీకాంతం, బూరాడ లక్ష్మీనారాయణ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీలో విఫలం

- మండిపడిన సభ్యులు
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



వ్యవసాయాధికారిని ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు

సీతంపేట: ఏజెన్సీ ప్రాంత రైతులకు ఎరువులు పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మండిపడ్డారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేవం నిర్వహించారు. ఈ సందర్భంగా దారపాడు సర్పంచ్ జి. సుందరమ్మ మాట్లాడుతూ.. మా పంచాయతీ పరిధిలో కోసంగి, రామానగరం, గోలుకుప్పగూడ, తదితర గ్రామాలకు ఒక్క యూరియా, డీఏపీ బస్తా కూడా అందించలేదన్నారు. ఎరువులు ఎప్పుడు ఇస్తారని రైతులు అడుగుతుంటే సమాధానం చెప్పలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా యూరియా దొరక్కపోవడంతో ఒడిశా వెళ్లి 1250 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని శంభాం సర్పంచ్ ఎస్. తిరుపతరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. యూరియా కొరత లేదని సాక్షాత్తూ సీఎం చంద్రబాబు ప్రకటిస్తున్నా.. క్షేత్ర స్థాయిలో అందడం లేదన్నారు. ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ.. యూరియాను బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. దీనికి ఏఓ వాహని స్పందిస్తూ.. త్వరలో యూరియా వస్తుందని, పంచాయతీలన్నింటికీ అందిస్తామని చెప్పారు. అలాగే రీ సర్వే, డికేటీ పట్టాల పెండింగ్ పనులు పూర్తి చేయాలని సర్పంచ్‌లు కోరగా.. త్వరలోనే పూర్తి చేస్తామని తహసీల్దార్ శ్రీకన్య తెలిపారు. అనంతరం పలు సమస్యలను సభ్యులు లేవనెత్తారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, ఎంపీడీఓ బీబీ బి. మిశ్రో, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సత్యం, పీఆర్ ఏఈ కిరణ్‌కుమార్, హౌసింగ్ ఏఈ వెంకటేష్, ట్రైబుల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ డీఈ నాగభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

కొర్ర పంటలో పంటకోత ప్రయోగం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బాతుగుడబ గ్రామంలో రైతులు సాగు చేసిన కొర్ర పంట వద్ద పంట కోత ప్రయోగాన్ని బుధవారం కురుపాం మండలం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.స్రవంతి, డాక్టర్ అనంత విహారి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కొర్ర పంట యొక్క పొడవు, మొక్కకు వచ్చే గింజల పరిమాణం తదితర అంశాలను పరిశీలించి నమోదు చేసుకున్నారు. రైతులకు పలు సూచనలు చేశారు. వలిసెలు విత్తనాలను కూడా పంపిణీ చేశారు.

సామాజిక తనిఖీ ప్రజా వేదిక రేపు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఈ నెల 19న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎల్.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం మండలంలోని 27 పంచాయతీల్లో 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 30వ తేదీ వరకు ఉపాధి హామీ పథకం నిధులు రూ.35 కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి గ్రామ స్థాయిలో సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు నిర్వహించాయన్నారు. ఆ తనిఖీల్లో గుర్తించిన అంశాలపై చర్చించేందుకు నిర్వహించే ప్రజావేదికకు ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర స్థాయి సిబ్బంది, వేతనదారులు హాజరవ్వాలని కోరారు.

కొమరాడలో జేసీ పర్యటన



తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

కొమరాడ: మండలంలో జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి బుధవారం పర్యటించారు. తహసీల్దార్ కార్యాలయం, పీహెచ్‌సీల్లో తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ సత్యనారాయణ నుంచి సుమోటో కేస్ట్ సర్టిఫికెట్లపై ఆరా తీశారు. వ్యవసాయ శాఖ సిబ్బందికి ఈ క్రాప్ వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం కొమరాడ పీహెచ్‌సీని సందర్శించి మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి మండలంలోని పాలేం, కెమిశీల, ఉలిపిరి తదితర గ్రామ పంచాయతీ వీఆర్‌వోలు లేరని ఇన్‌చార్జిలతో పాలన సాగుతోందని తెలిపారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జేసీ హామీ ఇచ్చారు. పర్యటనలో పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఇకపై నిరంతర నిఘా

- డీఎస్పీ రాంబాబు



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ రూరల్: పోలీస్ వ్యవస్థల్లో ఉన్న ప్రతిఒక్కరూ విధి నిర్వహణలో భాగంగా నిరంతర నిఘా కొనసాగించడం ద్వారా నేరపూరిత సంఘటనలను అదుపు చేయవచ్చని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు అన్నారు. బుధవారం తన పరిధిలోగల పాలకొండ సర్కిల్ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, బత్తిలి పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులు, వాటి తాజా స్థితిగతులు, పరిశోధనాత్మక కేసుల్లో పురోగతిపై సమీక్ష చేపట్టారు. కేసుల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞాన మేళవింపుపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ ఆమిటి ప్రసాద్, ఎస్సైలు కె.ప్రయోగమూర్తి, కళాధర్, అప్పారావు, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

తెరవని రైతు సేవా కేంద్రాలు

జియ్యమ్మ వలస రూరల్: మండలంలోని అనేక రైతు సేవా కేంద్రాలు సకాలంలో తెరవడం లేదని, సచివాలయాల్లో పని చేస్తున్న వ్యవసాయ సహాయకులు రైతులకు అందించాల్సిన సేవలు లేవు సరికదా రైతులకు యూరియా ఇవ్వడం లేదని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కె.సీతారాం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రానికి వెళ్లగా ఉదయం 11 గంటల వరకు ఏ ఒక్క ఉద్యోగి ఆఫీసుకు రాలేదని తెలిపారు. అంతేకాకుండా ఈ-క్రాప్ సర్వేను ఇంతవరకు చేయడం లేదని తెలిపారు. దీంతో రేపు ధాన్యం కొనుగోలు ఎలా జరుగుతుందన్నారు. అన్నదాతను ప్రభుత్వం ఉసూరు మనిపిస్తుందని, మునుపెన్నడూ ఇలాంటి పరిస్థితి లేదన్నారు. రైతులకు అందించాల్సిన పథకాలు, రాయితీలు సంబంధిత అధికారులు స్పందించి ఆదుకోకుంటే తదుపరి పరిణామాలు కూటమి ప్రభుత్వం చవిచూడాల్సి ఉందని హెచ్చరించారు.

విస్తృతంగా వైద్యసేవలు

భామిని: ప్రజలందరికీ విస్తృతంగా వైద్యసేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతి ఆదేశించారు. మండలంలోని బాలేరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి. శివకుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. గర్భిణులకు నిర్వహిస్తున్న పరీక్షలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పెదరామలో ఉజ్జిడమ్మ సంబరాలు

సీతంపేట: మండలంలోని పెదరామలో సర్పంచ్ బి.తిరుపతిరా వు ఆధ్వర్యంలో బుధవారం ఉజ్జిడమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉజ్జిడి బుట్టకు ప్రత్యేక పూజ లు చేశారు. మేళతాళాల నడుమ యువత నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

జనావాసాల్లోకి భారీ కొండచిలువ

సీతంపేట: గొయిది పంచాయతీ జక్కరవలసలో భారీ కొండచిలువ బుధవారం కనిపించింది. నాటుకోళ్లను మింగేయడంతో ఎటూ కదల్లేక ఉండిపోవడంతో స్థానికులు దాన్ని పట్టుకుని చెరువు సమీపంలో విడిచిపెట్టారు.